ఆసియాలో శరవేగంగా రాజకీయమార్పులు



జ్యోతివెలిగించి సెమినార్ ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

కవాడిగూడ: ఆసియా ఖండంలోని దేశాల రాజకీయాల్లో శరవేగంగా మార్పులు వస్తున్నాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. దోమలగూడలోని ఏవి కళాశాలలో మంగళవారం ఏవీ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏసియన్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఆసియా భౌగోళిక- రాజకీయ సవాళ్లు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణ శాంతి, సౌభ్రాతృత్వం అన్న అంశాలతో భవిష్యత్‌లో ఆసియా దేశాలన్నీ కూటమిగా ఏర్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బీం బహదూర్ సుబ్బా, రాజకీయ విశ్లేషకులు గిరిధర్ మామిడి, ఏవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏసియన్ స్టడీస్ సెక్రటరీ డాక్టర్ గీతా రెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీకి కందగట్ల స్వామి విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్, కందగట్ల స్వామి

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్, భువనగిరి స్థానాలను పద్మశాలి అభ్యర్థులకు కేటాయించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నారాయణగూడలోని పద్మశాలిభవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత, టెక్స్‌టైల్స్, పద్మశాలి కార్పొరేషన్లకు చైర్మన్లు, పాలకమండళ్లను వెంటనే నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నిజామాబాద్ ఎంపీ టికెట్‌ను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు ఇవ్వాలని కోరారు. ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గజం అంజయ్య, చేనేత రాష్ట్ర, జాతీయ అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు గడ్డం జగన్నాథం, వనం విశ్వనాథం, మాచర్ల రాంచందర్, బొమ్మ రఘురాం, వనం దుశ్యంతల, డాక్టర్ పుట్టా పాండురంగయ్య, అవ్వారు భాస్కర్, గుంటక రూపా, మెతుకు సత్యం, రమేష్, బొమ్మ అమరేందర్, కత్తుల సుదర్శన్, అంబటి శ్రీనివాస్, గౌతం, చిన్ని రాకేష్, కర్నాటి శ్రీనివాస్, పెద్ద జగదీష్, రాపోలు జ్ఞానేశ్వర్, తడక రమేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యశోదా ఆర్గానిక్స్‌కు ఇన్నోవేటివ్ అవార్డు



జస్టిస్ చంద్రయ్య, జయేష్ రంజన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అశోక్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ది కనెక్స్ సంస్థ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని యశోదా ఆర్గానిక్స్ సంస్థకు ఇన్నోవేటివ్ బిజినెస్ అవార్డును అందజేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల కార్యదర్శి జయేష్ రంజన్, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య చేతుల మీదుగా యశోదా ఆర్గానిక్స్ సంస్థ ప్రొప్రైటర్ జి.అశోక్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా గానుగ నూనెలు, ఆర్గానిక్ సిరిధాన్యాలు, పప్పులు తదితర వస్తువులను సరసమైన ధరలకు విక్రయిస్తున్నందుకు ఈ అవార్డును ఎంపిక చేసినట్లు తెలిపారు. కల్తీ లేని ఆహారపదార్థాలను అందజేస్తున్నందుకు తమను గుర్తించి ఇన్నోవేటివ్ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. నమ్మకమైన తమ సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.

మ్యారేజ్ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించాలి



మ్యారేజ్ బ్యూరోస్ జేఏసీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అర్జున్‌రావు తదితరులు

ఆల్ ఇండియా మ్యారేజ్ బ్యూరోస్ జేఏసీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని మ్యారేజీ బ్యూరోలను గుర్తించి, నిర్వాహకులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని ఆల్ ఇండియా మ్యారేజ్ బ్యూరోస్, జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అర్జున్‌రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మ్యారేజ్ బ్యూరోస్ జేఏసీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా అర్జున్‌రావు మాట్లాడుతూ మ్యారేజ్ బ్యూరోస్ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. మ్యారేజ్ బ్యూరోస్ వ్యవస్థ మీద తప్పుడు ప్రకటనలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మ్యారేజ్ బ్యూరోస్ అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల కమ్యూనిటీ జేఏసీ అధ్యక్షులు సుమన్, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి శ్రీనివాస్, మ్యారేజ్ బ్యూరోస్ జేఏసీ ప్రతినిధులు కొండ స్వామి, అంజని, బాలరాజ్‌గౌడ్, వెంకన్నబాబు, భారతి, నందిని, ఉమ, రమ్య, మంజుల, విజయలక్ష్మి, సుదర్శన్‌గౌడ్, శ్రీదేవి, మునీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'దళితుల ఐక్యతని దెబ్బతీసింది చంద్రబాబే'

లిబర్టీ: విభజించు, పాలించు అన్న విధానం ద్వారా గత ఉమ్మడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దళితుల్లో చిచ్చు పెట్టారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. మాల మహానాడు కార్యాలయంలో మంగళవారం శ్రీకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతను చంద్రబాబునాయుడు దెబ్బతీశారని ఆరోపించారు. దళితులు రాజ్యాంగ హక్కుల కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం 1995 వరకు సంఘటితంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. ఎప్పుడైతే వర్గీకరణను కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటైందో, దాన్ని అదునుగా తీసుకొని నాటి సీఎం చంద్రబాబు దళితుల ఐక్యతను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మందకృష్ణ మాదిగ ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంత పాడుతారని ఆరోపించారు. తనకు తన ప్రయోజనాలు తప్ప దళిత జాతికి చేసింది ఏమీ లేదని ఈ సందర్భంగా విమర్శించారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించిన బీజేపీకి మందకృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు పటిష్టమైన చర్యలు

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

హిమాయత్‌నగర్: నగరంలో వీధి కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించేందుకు జీహెచ్ఎంసీ పటిష్టమైన చర్యలు చేపట్టిందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అడిషనల్ కమిషనర్ రవి కిరణ్, వెటర్నరీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమై వీధి కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధికుక్కల బారిన పడకుండా ప్రజలకు రక్షణ కల్పించేందుకు వెటర్నరీ శాఖ అధికారులు వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటి బర్త్ కంట్రోల్ (ఏ.బి.సి) చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీధి కుక్కలకు రెగ్యులర్‌గా వ్యాక్సిన్ వేయాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. కుక్కల దాడులు ఎందుకు జరుగుతున్నాయనే దానిపై అధ్యయనం చేయాలన్నారు. కుక్క కాటుకు గురికాకుండా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. మటన్, చికెన్ షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను ఖాళీ స్థలంలో పారవేయకుండా చూడాలని, ఎప్పటి కప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వెటర్నరీ చీఫ్ డా.అబ్దుల్ వకీల్, బ్లూ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అక్కినేని అమల, కుమారి పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ఫీజులు తగ్గించాలి

లిబర్టీ: పెంచిన టెట్ పరీక్ష ఫీజులు వెంటనే తగ్గించాలని దళిత బహుజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటుకల గణేశ్ డిమాండ్ చేశారు. సమైక్య కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెట్ పరీక్ష ఫీజులను రెండు మూడింతలు పెంచడం సమంజసం కాదన్నారు. ఒక పేపర్‌కి వెయ్యి రూపాయలు, మరో పేపర్ రాస్తే రెండు వేల రూపాయలు.. ఇలా ఏకంగా రూ.2500లు అదనంగా పెంచారని తెలిపారు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: దేశంలో అవినీతిరహిత పాలన నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి నేతలు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, సి.వినోద్ యాదవ్, రాధేశ్యాం, నందం దివాకర్, ఈశ్వరప్ప, సంజయ్ గనాటే, మహేష్, రమేష్ గౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బస్తీబాట



బస్తీవాసులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

నల్లకుంట: బస్తీ పర్యటనలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి మంగళవారం నల్లకుంట డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రత్నానగర్, సత్యానగర్‌లలో బస్తీ సంక్షేమ సంఘాలు, స్థానికులతో ముచ్చటించారు. స్థానికంగా ఏమైనా ప్రజాసమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు, స్థానిక కార్పొరేటర్ అమృత, రత్నానగర్‌బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించుకుంటాం



గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను అభినందిస్తున్న అనిల్‌యాదవ్

కాచిగూడ: హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆ పార్టీ రాష్ట్ర నేత, యాదవ సంఘం అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ జంగాల అనిల్ యాదవ్ అన్నారు. మంగళవారం కాచిగూడకు చెందిన యాదవ సంఘం నేతలు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ప్రజానాయకుడిగా, హైదరాబాద్ ప్రాంతంలో మంచి గుర్తింపు ఉన్న బలహీన వర్గాల నాయకుడు శ్రీనివాస్‌యాదవ్‌కు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ఆయన అన్నారు.

సంజనకు ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం



సంజనకు సేవా పురస్కారం అందజేస్తున్న సాయిరామ్ రాజు

కాచిగూడ: మహిళల అభివృద్ధి, సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్న బీసీ యువతి మండలి అధ్యక్షురాలు కె.సంజనకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సాల్వ సాయిరామ్ రాజు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్, హ్యుమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో హ్యుమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు, లయన్ ఆకుల రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అశోక్ యాదవ్ రాజీనామా

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్ యాదవ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గొల్లకురుమలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు కట్టించుకుని గొర్రెల యూనిట్లు ఇవ్వకుండా దాదాపు 18 నెలల పాటు కాలయాపన చేసిందన్నారు. డీడీలు చెల్లించిన వారు అప్పులపాలైన సంఘటనలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గొల్లకురుమలకు తగిన న్యాయం చేయకపోవడంతోనే పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు.

డాక్టరేట్ ప్రదానం



సుధారాణి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ విద్యార్థిని సుధారాణికి జన్యుశాస్త్రంలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. జన్యుశాస్త్రం అధ్యాపకురాలు ప్రొ.రోజరాణి పర్యవేక్షణలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫైటో ఎక్స్‌ట్రాక్ట్ ఫర్ యాంటీ ఏపీలెప్టిక్ యాక్టివిటీ ఆఫ్ అకాలిఫా ఇండికా అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ అందుకున్న సుధారాణికి పెద్ద నాన్న మాజీ ఎమ్మెల్యే అబ్రహంతో పాటు తల్లిదండ్రులు యేసుబు, భాగ్యమ్మ అభినందించారు.

బీజేపీలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్ చేరిక



కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన వనం రమేష్

కాచిగూడ: నల్లకుంట మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నేత వనం రమేష్ తన అనుచరులతో మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో వనం రమేష్‌కు పార్టీ కండువాను కప్పి పార్టీలోకి కిషన్ రెడ్డి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీలోనే ఉన్న రమేష్ బీఆర్ఎస్ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, ఎస్.వెంకటేష్‌గౌడ్, ఆర్.హిమగిరి, ఎస్.హరిబాబు, కె.నిఖిల్, ఎస్.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను అలరించిన ద్విభాషా సినీసంగీతం



సత్కారం పొందిన రమణారెడ్డి, ఎం.వి.రామిరెడ్డిలతో సైదారెడ్డి

చిక్కడపల్లి: ఎస్ఆర్ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు డి.సైదారెడ్డి నిర్వహణలో త్యాగరాయగానసభలో నిర్వహించిన ద్విభాషా సినీసంగీత విభావరి అలరించింది. గాయకులు ఎంపిక చేసుకున్న తెలుగు, హిందీ చిత్ర గీతాలను 12 గంటల పాటు నిర్విరామంగా ఆలపించారు. అతిథులు జెన్‌ప్యాక్ పాలిమర్స్ ఎం.డి. బి.రామణారెడ్డి, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.వి.రామిరెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు, గాయకులు ఆడమ్స్, రవీంద్ర, దేవేందర్‌గౌడ్, అర్జున్, శైలజ, బాజీ, రుద్రారెడ్డి, కావ్యారెడ్డి, మాలతి, రాధారెడ్డి పాల్గొన్నారు.

చేతిరాత పోటీలో స్నేహిత్‌కు ప్రథమ బహుమతి



చేతిరాత పోటీలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థి స్నేహిత్

కాచిగూడ: నారాయణ విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'దాండీ-స్టైలస్ - అందమైన చేతిరాత' పోటీ పరీక్షలో నారాయణగూడలో మొదటి తరగతి చదువుతున్న విద్యార్థి స్నేహిత్ ఐదు రౌండ్లలో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతితో పాటు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు శరణి మాట్లాడుతూ పిల్లల్లో అంతర్గత ప్రతిభను వె లికి తీయడానికి ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నారా యణ సంస్థల ఈ-చాంప్స్ కో ఆర్డినేటర్ భవాని, ఆర్ అండ్ డి మహేశ్వరి, నారాయణగూడ జోన్ ఏజీఎం బాల పరమేశ్వరి, ప్రిన్సిపాల్ హర్‌నీత్ కౌర్, వైస్ ప్రిన్సిపల్ మోహిఉన్నిసా పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే

బంజారాహిల్స్: చెరువుల పరిరక్షణపై జీహెచ్ఎంసీ దృష్టిసారించింది. ఈ మేరకు చెరువులు కబ్జాకు గురికాకుండా చుట్టూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా నిత్యం పర్యవేక్షించేందుకు లేక్ కమిటీలు ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్, కార్వాన్ సర్కిళ్ల పరిధిలో 14 చెరువులు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటికీ లేక్ కమిటీలు ఏర్పాటుచేశామన్నారు. కమిటీల్లో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల శాఖ అధికారులతో పాటు స్థానిక సంక్షేమ సంఘాలను కూడా భాగస్వాములు చేశామన్నారు. ఒక్కో కమిటీలో 8 మంది సభ్యులు ఉంటారని, వీరంతా ప్రతిరోజూ తమకు కేటాయించిన చెరువులను పరిశీలించాల్సి ఉంటున్నారు. అంతేకాకుండా చెరువుల ఫోటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ ఉప కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసులు ప్రతిరోజూ ఈ ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడాల్సిన బాధ్యత ఉంటుందని చెప్పారు. తరచూ కమిటీ సమావేశం జరుగుతుందని, ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితులపై సమీక్షలు నిర్వహించాలని స్పష్టం చేవారు. ఎక్కడైనా చెరువు కబ్జా జరిగితే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే తెలిపారు.

కారు అద్దాల బ్లాక్ ఫిల్మ్ తొలగింపు



కారు అద్దాల బ్లాక్ ఫిల్మ్ తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ గౌస్‌ఖాన్

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న వాహనాలపై పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించడమే కాకుండా డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం పంజగుట్ట ట్రాఫిక్ సీఐ గౌస్‌ఖాన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులను గుర్తించారు. బ్లాక్‌ఫిల్మ్‌తో తిరుగుతున్న కారును ఆపి ఫిల్మ్‌లు తొలగించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ గౌస్‌ఖాన్ హెచ్చరించారు.

ఆర్థికసాయం కోసం దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: తండ్రి, సంరక్షకుడు లేని విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల మున్నూరుకాపు విద్యార్థులు దరఖాస్తులను ఏప్రిల్ 7వ తేదీ లోగా కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్: 040-24658160లో సంప్రదించాలని తెలిపారు.

ప్రీప్రైమరీ టీచర్ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన టిప్స్ టెక్ విహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రీ-ప్రైమరీ టీచర్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సెంటర్ డైరెక్టర్ కొంగర శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో ప్రీ-ప్రైమరీ ఎడ్యుకేషన్, చైల్డ్ సైకాలజీ, టీచింగ్ మెథడ్స్, చైల్డ్ హెల్త్‌కేర్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, ప్రాక్టికల్ అంశాలలో ఆరు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 90300 31419 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'పరిశుభ్ర హైదరాబాదే' లక్ష్యం



బాకారంలో నిర్వహించిన ర్యాలీలో గోవర్ధన్ తదితరులు

ముషీరాబాద్: పరిశుభ్రమైన హైదరాబాద్‌గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, అదే అందరి లక్ష్యం కావాలని జీహెచ్ఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ వి.గోవర్ధన్ అన్నారు. మంగళవారం రోడ్లపై చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని బాకారం, ఇందిరానగర్ తదితర ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోవర్ధన్ మాట్లాడుతూ ఈ అంశంపై జూన్ 2వ తేదీ వరకు ర్యాలీలు, ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు చెత్త సేకరించే రిక్షా కార్మికులుకు చెత్తను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటరీ ఫీల్డ్ ఆఫీసర్స్(ఎస్ఎఫ్‌వో)లు హరినాథ్, మోహన్‌దాస్, ఆంజనేయులు, రాకేష్, గంగాధర్, రజీవ్, నవీన్, హరికుమార్, విజయలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న సిబ్బంది

కాచిగూడ: ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఉక్కాల రాజేష్ సూచించారు. మెడికోవర్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో బర్కత్‌పుర-లింగంపల్లి పార్కులో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ వేసవిలో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కె.పి.మురళీకృష్ణ, మాజీ కార్పొరేటర్ వి.ఎస్.రెడ్డి, హాస్పిటల్ బ్రాంచి హెడ్ రాజ్‌కుమార్, మేనేజర్ వినోద్ కుమార్, సునీల్ కుమార్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో సురేఖ, ఈవో దేవదానం, భక్తులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ దోమలగూడ హనుమాన్ దేవాలయంలో ఆరు నెలల హుండీ లెక్కింపు ద్వారా ఆలయానికి లక్షా 43 వేల 570 రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ తెలిపారు. మంగళవారం దేవాదాయ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ బి. సురేఖ, ఆలయ కార్యనిర్వహణ అధికారి దేవనాథం, ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సమక్షంలో హుండీ లెక్కించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ జి.రాజశేఖర్ గౌడ్, కె.ఆర్.కె.ప్రసాద్, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, గద్దె వేణుగోపాల్, పరమేశ్వర్, లక్ష్మీనారాయణ, సంతోష్‌కుమార్, నర్సింగ్‌రావు, వెంకట్‌రెడ్డి, సంజయ్‌సింగ్, లక్ష్మణ్, సురేష్, పరిమళ్‌కుమార్, మహేందర్, శ్రీనివాస్, ప్రధాన అర్చకులు ప్రభు, మహేందర్ పాల్గొన్నారు.

హోటళ్లకు రేటింగ్స్ ఇవ్వాలంటూ మోసం

బాధితుడి నుంచి రూ.37 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా వేదికగా దేశంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, పర్యాటక ప్రాంతాలు, ఇతర బ్రాండ్‌లకు ప్రమోషన్ చేయాలని చెప్పి ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం.. సోషల్ మీడి యా, గూగుల్‌లో రేటింగ్స్ ఇస్తూ డబ్బు సంపాదించవచ్చని నమ్మిస్తూ ఓ బాధితుడికి వాట్సాప్‌లో సందేశం వచ్చింది. ఆ మెసేజ్ ద్వారా వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా.. అతడిని సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. గూగుల్‌లో రేటింగ్‌లు ఇవ్వాలని వివిధ టాస్క్‌లు ఇస్తూ ఆన్‌లైన్ ద్వారా డబ్బు సంపాదించవచ్చని నమ్మించారు. ఇందుకు గాను బాధితుడిని వేర్వేరు బ్యాంక్ ఖాతాలను ఓపెన్ చేయించారు. అనంతరం వివిధ చార్జీలు, మరిన్ని టాస్కుల పేరుతో బాధితుడి వద్ద డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అయితే, లాభాలు విత్ డ్రా కావడం లేదని బాధితుడు వారిని ప్రశ్నించగా అతని ఖాతాను నేరగాళ్లు బ్లాక్ చేశారు. కాగా, అప్పటికే విడతల వారీగా బాధితుడి నుంచి మొత్తం రూ.37,65,070 కాజేశారు. డబ్బు విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పంపాలని సైబర్ కేటుగాళ్లు వేధించారు. దీంతో బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.